సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం । 14 । మే । 2024



అశ్వ వాహనంపై చెన్నకేశవుడు
పుష్పగిరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి లక్ష్మీ చెన్నకేశవస్వామి అశ్వ వాహనంపై కొలువు దీరి భక్తులకు దర్శనమిచ్చారు. -8లో



ఆటో ఢీకొని యువకుడి దుర్మరణం
ఇంటికి వచ్చిన బంధువును బస్టాండులో వదిలేందుకు బైక్‌పై వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. -8లో



టీడీపీ నాయకుల హల్‌చల్
వైఎస్సార్ జిల్లా బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని చిన్నకేశంపల్లెలో టీడీపీ నాయకులు ఏజెంట్లను బయటికి పంపే యత్నంలో వారిపై దాడికి తెగబడ్డారు. - 8లో

ఓటు వేసిన ప్రముఖులు


సదుంలోని ఎర్రాతివారిపల్లిలో ఓటువేసిన రాజంపేట ఎంపీ పీవీ మిథున్ రెడ్డి


నందలూరు: వైసీ పల్లిలో ఓటు వేసిన రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి


రాయచోటి: ఓటు వేసిన శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ ఎం.జకియా ఖానమ్


రాయచోటి: ఓటు వినియోగించుకున్న కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్ కిశోర్


రైల్వేకోడూరు మండలం రెడ్డివారిపల్లెలో ఓటు వేస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు


రామాపురం మండలం ఎర్రంరెడ్డిగారి పల్లెలో ఓటువేస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి


వాల్మీకిపురం:జర్రవారిపల్లెలో సతీసమేతంగా ఓటు వేసిన ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


రాజంపేట: ఆకేపాడులో ఓటు వేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి


మదనపలిలో ఓటు వినియోగించుకున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్ అహ్మద్


నందలూరు:ఎలాగడ్డలో ఓటు వేసిన ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ఆయన సతీమణి


పెనగలూరు:కొండూరులో ఓటువేసిన మాజీ ఎమ్మెల్యే ప్రభావతమ్మ కుటుంబ సభ్యులు

రైల్వేకోడూరులో ఉదయం 6.30 గంటలకే బారులు తీరిన ఓటర్లు



ఓటెత్తిన చైతన్యం

- చెదురు మదురు ఘటనలు మినహా అంతా సవ్యం
- ఉదయం నెమ్మదిగా... సాయంత్రం జోరుగా....
- అక్కడక్కడా వర్షాలు పడినా రాత్రి వరకు కొనసాగిన పోలింగ్
- పలుచోట్ల ఈవీఎంలు మొరాయించినా అధికారుల సత్వర చర్యలు
- వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు


నిమ్మనపల్లిలో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు


లక్కిరెడ్డిపల్లెలో ఓటుకోసం వస్తున్న వృద్ధురాలు

సాక్షి, రాయచోటి: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజైన సోమవారం అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో ఓటర్లు పోటెత్తారు. ఉదయం ఆరు గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ప్రత్యేకించి మహిళలు భారీగా తరలి వచ్చారు. ఉదయం 11 గంటల వరకు ఎండ ప్రభావం తక్కువగా ఉండటంతో ఓటర్లు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. కొన్ని పోలింగ్ కేంద్రాలలో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్ కిషోర్ జిల్లాలో విస్తృతంగా చేపట్టిన ఓటరు చైతన్య కార్యక్రమాల ఫలితంగా... సోమవారం సాయంత్రం 6 గంటల వరకు కూడా జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలోని పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్లలో మహిళలు, పురుషులు, యువత పెద్ద ఎత్తున బారులు తీరారు. ప్రతి ఒక్కరూ పండుగ వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఉత్సాహం చూపారు. జిల్లాలో చెదురుముదురు సంఘటనలు, ఉద్రిక్తతల మధ్య ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆధ్వర్యంలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఘర్షణ వాతావరణం నెలకొన్న వెంటనే పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని చక్కదిద్దారు. దీంతో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.

మొరాయించిన ఈవీఎంలు

- రాయచోటి అసెంబ్లీ పరిధిలోని సంబేపల్లి మండలం, రౌతుకుంట పోలింగ్ స్టేషన్ నంబర్ 257లో ఉదయం ఈవీఎం మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది.
- మదనపల్లె నియోజకవర్గం నిమ్మనపల్లె మండలం రెడ్డివారిపల్లె, కొండయ్యగారి పల్లె, నిమ్మనపల్లె ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు కొద్దిసేపు మొరాయించడంతో పోలింగ్ ప్రక్రియ ఆలస్యంగా ప్రారంభమైంది.
- మదనపల్లె మండలం కొత్తపల్లి పోలింగ్ స్టేషన్ నంబర్ 36 లో ఈవీఎం పనితీరు నిదానంగా సాగడంతో పోలింగ్ ఆలస్యంగా జరుగుతోంది. దీనికి తోడు పోలింగ్ సిబ్బంది అల్పాహారం కోసం సుమారు 15 నిమిషాలకు పైగా పోలింగ్ నిలిపివేయడంతో ఓటర్లు ఇబ్బంది పడ్డారు.
- పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట మండలాల్లో ఈవీఎంలో ఓటు వేశాక బీప్ శబ్దం రావడం ఆలస్యమైంది. దీంతో ఓటర్లు క్యూ లైన్‌లో గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది.
- వాల్మీకిపురం మండలం పెద్దివీడు రెడ్డివారిపల్లెలో ఒక బూత్‌లో ఈవీఎంలు రెండు గంటల పాటు పనిచేయక అంతరాయం జరిగింది.

నియోజకవర్గాల వారీగా.. వివిధ సమయాల్లో పోలింగ్ శాతం..

నియోజకవర్గం	ఉ॥ 9	ఉ॥11	మ॥ 1	మ॥ 3	సా॥ 5	10.30
రాజంపేట	7.89	22.54	40.00	53.3	66.56	75.46
రైల్వేకోడూరు	10.31	25.59	41.31	54.33	67.23	74.13
రాయచోటి	10.5	25.2	40.19	53.45	68.25	76.08
తంబళ్లపల్లి	10.1	24.65	40.47	55.54	70.15	80.09
పీలేరు	11.5	25.59	43.07	57.25	70.03	79.02
మదనపల్లి	9.62	24.2	33.6	53.1	64.09	73.07

పోలింగ్ సరళిని పరిశీలించిన కలెక్టర్

పీలేరు: సాధారణ ఎన్నికల పోలింగ్ సందర్భంగా పీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న పోలింగ్ సరళిని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... అన్నమయ్య జిల్లాలోని 1609 పోలింగ్ కేంద్రాలలో ప్రశాంతంగా ఓటింగ్ జరిగిందన్నారు. జిల్లాలో మధ్యాహ్నం 1.00 గంటకే 45 శాతం పోలింగ్ నమోదైందన్నారు. సాయంత్రం 6 గంటల వరకు క్యూ లైన్‌లో ఉన్న ఓటర్లందరికి ఓటు వేసే అవకాశం కల్పించాలని ఎన్నికల నిర్వహణాధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్యూ లైన్ లో ఉన్న ఓటర్ల గుర్తింపు కార్డులను పరిశీలించి పోలింగ్ కేంద్రాలలో వసతులు ఎలా ఉన్నాయి, పోలింగ్ ఎలా జరుగుతోందని ఓటర్లను అడిగి తెలుసుకున్నారు.

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా పోలింగ్ సరళి ఇలా..

సమయం	పోలింగ్ శాతం
ఉ॥ 7 నుంచి 9 వరకు	10.36
ఉ॥ 9 నుంచి 11.00 వరకు	24.63
ఉ॥ 11.00 నుంచి 1.00 వరకు	39.77
మ॥ 1.00 నుంచి 3.00 వరకు	54.49
మ॥ 3.00 నుంచి 5.00 వరకు	67.72
మ॥ 5.00 నుంచి 10.30 వరకు	76.25

జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య: 14,26,834
పోలైన ఓట్లు: 10,87,932

పురుషులు
మొత్తం ఓట్లు: 7,00,380
పోలైన ఓట్లు: 5,30,283

మహిళలు
మొత్తం ఓట్లు: 7,26,327
పోలైన ఓట్లు: 5,57,592

ఇతరులు
మొత్తం ఓట్లు: 127
పోలైన ఓట్లు: 57

మొత్తం పోలింగ్ శాతం: 76.25

ఉదయం మందకొడిగా..సాయంత్రం జోరుగా..

జిల్లాలో ఎన్నికలకు సంబంధించి ఉదయం 7.00 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. అయితే చాలాచోట్ల ఈవీఎంలు రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు మదనపల్లె తదితర ప్రాంతాల్లో కొద్దిసేపు మొరాయించినా టెక్నికల్ సిబ్బంది ద్వారా వేగవంతంగా సిద్ధం చేయించారు. పుల్లంపేట మండలం దళవాయిపల్లెలో ఇరు వర్గాలకు సంబంధించి తోపులాటలో ఈవీఎం దెబ్బతినడంతో కొద్దిసేపు పోలింగ్ నిలిచిపోయింది. ఆ తర్వాత కలెక్టర్ అభిషిక్త్ కిశోర్, ఎస్పీ కృష్ణారావుల ప్రత్యేక చర్యల ఫలితంగా వెంటనే పోలింగ్ ప్రారంభమైంది. ఉదయం ఓటింగ్‌శాతం మందకొడిగా ప్రారంభమై తర్వాత సాయంత్రం కేంద్రాలు కిక్కిరిసిపోయాయి. ఉదయం కూడా మహిళలు, వృద్ధులు పెద్దసంఖ్యలో బారులు తీరి కనిపించారు.

భారీ బందోబస్తు: అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా పోలింగ్‌ను పురస్కరించుకుని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలతోపాటు స్ట్రైకింగ్ ఫోర్స్, ఫ్లయింగ్‌స్క్వాడ్, క్విక్ రెస్పాన్స్ టీములు, రూట్ మొబైల్ వెహికల్స్‌తోపాటు ఏపీఎస్‌పీ, సీఆర్‌పీఎఫ్, ఏఆర్, సివిల్, ఇతర పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా పోలింగ్ ముగియడంతో రాయచోటిలోని కౌంటింగ్ కేంద్రానికి ఈవీఎంలు చేర్చడంతోపాటు చుట్టూ మూడంచెల భద్రతను కల్పించి కట్టుదిట్టం చేశారు. ఏది ఏమైనా జిల్లా వ్యాప్తంగా ఎలాంటి ఘటనలకు తావు లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.


సంబేపల్లెలో ఓటు వేసేందుకు వృద్ధురాలిని భుజంపై మోసుకొస్తున్న దృశ్యం


పీలేరు: ఎన్నికల అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి


రాయచోటిలో ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి


పీలేరులో ఓటరు స్లిప్పులను పరిశీలిస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్


పెనగలూరులో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు


మదనపల్లి మండలం కొత్తపల్లిలో ఓటు వేసేందుకు వస్తున్న శతాధిక వృద్ధురాలు పార్వతమ్మ

బరితెగించిన టీడీపీ వర్గీయులు

రైల్వేకోడూరులో ఉద్రిక్తత


రైల్వేకోడూరులో పోలింగ్ బూత్ వద్ద దౌర్జన్యం చేస్తున్న బత్యాల చెంగల్రాయుడు, అనుచరులు

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరు పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ప్రాంగణంలోని పోలింగ్ కేంద్రంలో టీడీపీ నాయకుడు బత్యాల చెంగల్రాయుడు తన అనుచరులతో వచ్చి దౌర్జన్యానికి దిగారు. వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి ఆయన అనుచరులు విషయం తెలుసుకుని హుటాహుటిన అక్కడకు వచ్చిన వారిని తీవ్ర స్థాయిలో ప్రతిఘటించారు. ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. పారామిలిటరీ బలగాలు జోక్యం చేసుకుని టీడీపీ నాయకులను తరిమికొట్టారు. అనంతరం టోల్‌గేట్ వద్దకు చేరుకుని టీడీపీ నాయకులు ప్రజలను , ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై రాళ్ల దాడికి దిగారు.


కేవీ పల్లె మండలం దేవాండ్లపల్లిలో రాళ్లతో దాడి చేస్తున్న టీడీపీ వర్గీయులు


లక్కిరెడ్డిపల్లె మండలం చౌటపల్లెలో బందోబస్తు విధుల్లో అడిషనల్ ఎస్పీ హైమవతి, డీఎస్పీ శ్రీధర్

సాక్షి నెట్‌వర్క్: లక్కిరెడ్డిపల్లి మండలం చౌటపల్లె పోలింగ్ కేంద్రం వద్ద వైఎస్సార్‌సీపీ వర్గీయులపై టీడీపీ వర్గీయులు రాళ్లతో దాడి చేశారు. పోలీసులు సర్ది చెప్పేందుకు ప్రయత్నించినా వారు శాంతించలేదు. మీ అంతు తేలుస్తామంటూ వైఎస్సార్‌సీపీ వర్గీయులను బెదిరించారు. ఇదే సమయంలో రాయచోటి టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తన అనుచరులతో అక్కడికి చేరుకున్నారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న అడిషనల్ ఎస్పీ హైమావతి, డీఎస్పీ శ్రీధర్, స్పెషల్ పార్టీ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు.

- రాయచోటి అసెంబ్లీ పరిధిలోని నక్కవాండ్లపల్లి 175 పోలింగ్ కేంద్రంలో టీడీపీ వర్గీయుల దాడిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు తిరుపాల్ నాయుడు తీవ్రంగా గాయపడ్డారు.
- మదనపల్లి బీటీ కళాశాల పోలింగ్ బూత్‌లోకి టీడీపీ అభ్యర్థి షాజహాన్ బాషా దూసుకుని వచ్చింది.
- లక్కిరెడ్డిపల్లి మండలం అనంతపురం గ్రామపంచాయతీ చౌటుపల్లిలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురి ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి.
- లక్కిరెడ్డిపల్లి మండలం దప్పేపల్లి గ్రామం మేడిమాకల గుంతరెడ్డివారిపల్లె పోలింగ్ కేంద్రంలో ఇరు పార్టీల ఏజెంట్ల మధ్య గొడవ జరిగింది.
- కేవీపల్లె మండలం జిల్లేల్లమంద పంచాయతీ దేవాండ్లపల్లె పోలింగ్ బూత్ వద్ద టీడీపీ, వైఎస్సార్ సీపీ నాయకుల మధ్య చిన్నపాటి గొడవ చోటుచేసుకుంది. పోలీసులు అక్కడి చేరుకోవడంతో పరిస్థితి సద్దుమణిగింది.
- లక్కిరెడ్డిపల్లి మండలం బి.ఎర్రగుడి గ్రామం చెంచర్లపల్లె పోలింగ్ బూత్‌లో ఇరువురు ఏజెంట్ల మధ్య ఘర్షణ జరిగింది. పోలీసులు రావడంతో గొడవ సద్దుమణిగింది.
- రాయచోటి మండలం చెన్నముక్కపల్లి గ్రామం దూలవారిపల్లి పోలింగ్ స్టేషన్ నంబర్ 85లో ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. పోలీసుల రాకతో పరిస్థితి ప్రశాంతంగా మారింది.
- రైల్వేకోడూరు మండలం శెట్టిగుంటలో పోలింగ్ బూత్ నంబర్ 110. 111లో ఇరు పార్టీల మధ్య తోపులాట జరిగింది. పోలీసుల రంగ ప్రవేశం చేయడంతో సమస్య సద్దుమణిగింది.
- మదనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రైమరీ స్కూల్ వద్ద టీడీపీ నాయకులు కండువా, పసుపు చొక్కాలు ధరించి టీడీపీకి ఓటేయాల్సిందిగా ఓటర్లను అభ్యర్థించారు. దీనిపై ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ నాయకులపై దౌర్జన్యానికి పాల్పడ్డారు.

ఇరువర్గాల ఘర్షణ


గుర్రంకొండ మండలం మామిళ్లవారిపల్లె పోలింగ్ కేంద్రం వద్ద ఇరువర్గాల ఘర్షణ

గుర్రంకొండ: మామిళ్లవారిపల్లె ప్రాథమిక పాఠశాలలో టీడీపీకి చెందిన కొంతమంది క్యూలైన్లలో ఓటరు స్లిప్పులు పంచుతున్నారనే ఆరోపణలతో ఇరుపార్టీల కార్యకర్తల నడుమ వాగ్వాదం నెలకొంది. ఈ సంఘటన చిలికి చిలికి గాలి వానలా మారి ఘర్షణకు దారి తీసింది. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. గెరికుంటపల్లెలో ఉదయం నుంచి సాయంత్రం వరకు మూడుమార్లు ఘర్షణలు చెలరేగాయి. దివ్యాంగులు, నడవలేని వృద్ధులకు సహాయకులుగా వైఎస్సార్‌సీపీ వారు రాకూడదంటూ టీడీపీ వర్గీయులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల నడుమ ఘర్షణ జరిగింది. కొద్దిసేపు పోలింగ్ ప్రక్రియ నిలిచిపోయింది.

పోలింగ్ ప్రక్రియ పరిశీలన

కలికిరి : మండలంలో జరుగుతున్న ఎన్నికల పోలింగ్ ప్రక్రియను రాజంపేట ఎంపీ పీవీ.మిథున్‌రెడ్డి పర్యవేక్షించారు. మండల కేంద్రం కలికిరితో పాటు మర్రికుంటపల్లి, పత్తేగడ తదితర గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆయన ఎటువంటి అసాంఘిక ఘటనలు చోటు చేసుకోకుండా చూడాలని పోలింగ్ అధికారులను కోరారు. ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి ఆయన వెంట పాల్గొన్నారు.

యువకుడు మృతి

రాజంపేట : మండలంలోని నూకినేనిపల్లె పంచాయతీ పరిధిలో బలిజపల్లెకు చెందిన యువకుడు వి.వెంకటప్రసాద్(28) సోమవారం అనుమానస్పద స్థితిలో మృతి చెందారని ఎస్ఐ అబ్దుల్‌జహీర్ తెలిపారు. రోడ్డుపై పడి వుండటాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

టీడీపీ నాయకుల హల్‌చల్

- ఏజెంట్లను బయటికి పంపేందుకు యత్నం
- అడ్డుకున్న ఇతర ఏజెంట్లపై దాడి

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఓటర్లు పెద్ద ఎత్తున తరలి రావడంతో సోమవారం అర్ధరాత్రి వరకు పోలింగ్ కొనసాగింది. ఇది జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు పలుచోట్ల ఏదో కారణం చూపుతూ ఘర్షణలకు దిగారు. రాళ్లతో దాడులు చేస్తూ ఓటర్లను భయభ్రాంతులకు గురిచేశారు. కొన్ని చోట్ల ఏజెంట్లను బయటికి తరిమే యత్నంలో వారిపైనా దాడులు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పలు చోట్ల తీవ్రంగా గాయపడ్డారు. ఓటు వేయాలని వచ్చిన ఓ మహిళ చేయి విరిగింది. ఎలాగైనా గెలవాలంటూ.. టీడీపీ తీవ్ర స్థాయిలో కవ్వింపు చర్యలు దిగింది.

బద్వేలు అర్బన్ : వైఎస్సార్ జిల్లా బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని చిన్నకేశంపల్లెలో టీడీపీ నాయకులు హల్‌చల్ చేశారు. ఏజెంట్లను బయటికి పంపే యత్నంలో.. వారిపై దాడికి తెగబడ్డారు. మండలంలోని చిన్నకేశంపల్లె గ్రామంలోని 179వ బూత్‌లో పోలింగ్ జరిగింది. ఉదయం వైఎస్సార్‌సీపీ, బీజేపీ, ఇతర పార్టీల తరపున 8 మంది ఏజెంట్లు పాల్గొన్నారు. బూత్‌లో మొత్తం 947 ఓట్లు ఉండగా సాయంత్రం 5 గంటలకు 747 పోలయ్యాయి. సాయంత్రం బీజేపీ ఎమ్మెల్యే, టీడీపీ ఎంపీ అభ్యర్థుల ఏజెంట్లు వచ్చి మిగతా పార్టీల ఏజెంట్లు బయటకు వెళ్లాలంటూ హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ, జనసహాయకశక్తి పార్టీల ఏజెంట్లు రవీంద్ర, మల్లికార్జునరెడ్డి ఎందుకు వెళ్లాలంటూ అడ్డు చెప్పారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం తలెత్తింది. అనంతరం తెలుగుదేశంపార్టీ నాయకులు రితీష్‌రెడ్డి ఓటు వేసేందుకు తన అనుచరులతో బూత్ వద్దకు రాగా, ఘర్షణ విషయాన్ని ఆయనకు టీడీపీ నాయకులు తెచెప్పారు. కోపోద్రిక్తుడైన రితీష్ ఏజెంట్ మల్లికార్జునరెడ్డిని పరుషపదజాలంతో దూషిస్తూ ఊరు విడిపిస్తా అంటూ హెచ్చరించారు. అంతటితో ఊరుకోక 'కొట్టండిరా' అంటూ అరవడంతో ఆయన అనుచరులు మల్లికార్జునరెడ్డిని బయటకు లాగి విచక్షణారహితంగా దాడి చేశారు. అక్కడి పోలీసులు ఆపాలని యత్నించినా బెదరకుండా దాడికి దిగారు. ఈ ఘటనలో మల్లికార్జునరెడ్డి చొక్కా చినిగిపోవడంతో గాయాలయ్యాయి. అక్కడే విధుల్లో ఉన్న పోలీసులు ఆపే ప్రయత్నం చేస్తున్నప్పటికీ ఏ మాత్రం బెదరకుండా దాడికి యత్నించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏజెంట్ రవీంద్రపై కూడా దాడి చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న అర్బన్ సీఐ చేరుకుని టీడీపీ నాయకులను గ్రామం నుండి పంపించి వేశారు. ఎమ్మెల్యే డాక్టర్ సుధ బాధితుడితో కలిసి అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేయించారు. ఓటమి భయంతోనే టీడీపీ నాయకులు ఏజెంట్లపై దాడులకు దిగారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె వెంట మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి రామసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పోలింగ్ బూత్ వద్ద వైఎస్సార్‌సీపీ, జనసహాయకశక్తి పార్టీ ఏజెంట్లపై దాడికి పాల్పడుతున్న టీడీపీ నాయకులు

కడప గౌస్ నగర్‌లో టీడీపీ రాళ్లదాడి

- వైఎస్ఆర్‌సీపీ నాయకుడు రమేష్‌రెడ్డికి గాయాలు
- అల్లరి మూకలను చెదరగొట్టిన పోలీసులు...


గాయపడిన రమేష్‌రెడ్డి

కడప అర్బన్ : కడప నగరంలోని దేవుని కడప రోడ్డులోని గౌస్‌నగర్ మున్సిపల్ బాలుర ప్రైమరీ పాఠశాల వద్ద టీడీపీ నాయకులు రాళ్ల దాడికి దిగారు. వల్లూరు మండలానికి చెందిన ఇద్దరు టీడీపీ కార్యకర్తలు గౌస్ నగర్‌లోని పోలింగ్ స్టేషన్ వద్దకు వచ్చి ఇంకా ఈవీఎంలను ప్యాకింగ్ చేసి పంపలేదా?అంటూ గద్దించారు. పోలీసులు, స్థానిక వైఎస్సార్సీపీ నాయకులు కలికి వారిని దేవుని కడప రోడ్డువైపు పంపించేశారు. దీంతో బూత్ వద్ద తమకు అవమానం జరిగిందని చెప్పి వారి మనుషులను పెద్ద ఎత్తున రప్పించారు. వారంతా కలిసి వైఎస్ఆర్‌సీపీ నాయకులు, స్థానిక యువకులపై రాళ్లను విసిరారు. కడప చిలకలబావి సమీపంలో వున్న ఓ పాఠశాల కరస్పాండెంట్, వైఎస్ఆర్‌సీపీ నాయకులు రమేష్‌రెడ్డి గాయపడ్డారు. డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, కడప నగర మేయర్ సురేష్ బాబు చేరుకున్నారు. అప్పటికే పోలీసు అధికారులు అల్లరి మూకలను తరిమికొట్టారు. ఈ సంఘటనపై సమగ్రంగా విచారిస్తామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామనీ సీఐ ఇబ్రహీం తెలియజేశారు. ఈ సంఘటనలో పోలీసులకు గాయాలైనట్లు సమాచారం.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి

ప్రొద్దుటూరు క్రైం : టీడీపీ నాయకులు దాడి చేసిన ఘటనలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మహమ్మద్ హనీఫ్ గాయపడ్డారు. టూ టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. ఆర్ట్స్ కాలేజీ రోడ్డుకు చెందిన మహమ్మద్ హనీఫ్ సోమవారం 128 పోలింగ్ స్టేషన్‌లో ఏజెంట్‌గా కూర్చున్నాడు. పోలింగ్ అనంతరం మైదుకూరు రోడ్డులోని బాలాజీ నగర్‌లో తన కుమారుడిని తీసుకొచ్చేందుకు బైక్‌లో బయలుదేరాడు. కొత్తి స్కూల్ వద్ద జనాలు గుంపుగా ఉండటంతో హనీఫ్ అక్కడికి వెళ్లాడు. అక్కడికి వచ్చిన టీడీపీ నాయకుడు బస్సు మురళీ 'కొట్టరా ఈ నాకొడుకును..' అంటూ రెచ్చ గొట్టగా డ్రైవర్ రామిరెడ్డి వాహనం దిగొచ్చి ప్యాకెట్ నైఫ్‌తో హనీఫ్‌పై దాడి చేసి గాయ పరిచాడు. దీంతో అతన్ని చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హనీఫ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు.

పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత

మైదుకూరు రోడ్డులోని కొత్తి హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు లాఠీ చార్జి చేశారు. పోలింగ్ సరళిని పరిశీలించేందుకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి కొత్తి హైస్కూల్ వద్దకు వెళ్లారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరదరాజులరెడ్డి అక్కడే ఉండడంతో ముందు జాగ్రత్త చర్యగా ఇరువురిని అక్కడి నుంచి వెళ్లిపోవాలని పోలీసులు సూచించారు. అదే సమయంలో వైఎస్సార్‌సీపీ వర్గీయులపై టీడీపీ నాయకులు కేకలు వేస్తూ కవ్వింపు చర్యలకు పాల్పడటంతో పోలీసులు లాఠీ చార్జి చేశారు.


గాయపడిన మహమ్మద్ హనీఫ్

కవ్వింపు.. రాళ్లతో దాడులు

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె మండలం యు.వెంకటాపురం, బుసిరెడ్డిపల్లె గ్రామాల్లో టీడీపీ నాయకులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై దాడికి పాల్పడ్డారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరు వర్గాలను చెదరగొట్టారు. బుసిరెడ్డిపల్లెలో టీడీపీ కార్యకర్తలు వైఎస్ఆర్‌సీపీ కార్యకర్త శ్రీనివాసులురెడ్డి చెవిని కొరికారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కడపలో వాగ్వాదం

కడప నగరంలోని పాత రెడ్ క్రాస్ బిల్డింగ్ వెనుక పోలింగ్ బూత్‌లో డిప్యూటీ సీఎం సోదరుడు అహ్మద్ బాషా ఉన్నారనే సమాచారంతో టీడీపీ నేతలు శ్రీనివాసులరెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి వచ్చి అందరినీ బయటికి పంపాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నేతలెవరూ పోలింగ్ వద్ద ఉండకూడదని చెప్పడంతో నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

చాపాడు మండలంలో ఘర్షణ

వైఎస్సార్ జిల్లా చాపాడు మండలం చిన్నగులువలూరులో టీడీపీ, వైఎస్సార్‌సీపీ వర్గీయుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. కుర్ర నరసింహులు అనే టీడీపీ కార్యకర్తకు గాయాలయ్యాయి. ఎస్పీ సిద్ధార్థ కౌశల్ సీరియస్‌గా తీసుకుని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రఘురామిరెడ్డితోపాటు వందమందిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.


చిలమకూరులో జిల్లా పరిషత్ హైసూకోల్ వద్ద వాగ్వాదానికి దిగిన ఇరువర్గాలు (ఇన్‌సెట్) బాధితుడు షాహీద్

ఎర్రగుంట్లలో దాడి

జమ్మలమడుగు నియోజకవర్గం ఎర్రగుంట్ల పట్టణ పరిధిలోని 14వ వార్డు ఇన్‌ఛార్జి షాహీద్‌పై టీడీపీ నేతలు దాడి చేశారు. జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ పోలింగ్ బూత్‌లో ఆయన ఓటు వేసి బయటకు రాగా.. ఇక్కడ ఏం చేస్తున్నావంటూ వటీడీపీ నేతలు ప్రశ్నించారు. ఓటు వేసి వస్తున్నానని అతను చెప్పినా.. వారు వినకుండా దాడి చేశారు.

ఇరువర్గాల వాగ్వాదం

జమ్మలమడుగు నియోజకవర్గం ఎర్రగుంట్ల మండలం చిలమకూరు పంచాయతీ పెద్దనపాడులో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. జిల్లా పరిషత్ హైస్కూల్ పోలింగ్ బూత్ ఎదురుగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఉండగా, వారిని పంపివేయాలని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి అనుచరుడు పోలీసులకు చెప్పారు. అదే సమయంలో సమీపంలోనే బీజేపీ శ్రేణులు ఉండటంతో.. వారిని పంపేయాలని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు కోరారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం పెరిగింది. బీజేపీ అభ్యర్థి ఆదినారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధీర్‌రెడ్డి చేరుకోగా.. పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో సమస్య సద్దుమణిగింది.

బూత్‌లలోనే ప్రచారం

బద్వేలు అర్బన్ : నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో ఉదయం ఏడు గంటలకే పోలింగ్ ప్రారంభమైనప్పటికీ పలుచోట్ల ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా మొదలైంది. పోలింగ్ ప్రారంభమైనప్పటి నుండి మధ్యాహ్నం వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. మధ్యాహ్నం తర్వాత పలు బూత్‌లలో టీడీపీ నాయకులు హల్‌చల్ చేసి బూత్‌లలోనే ప్రచారానికి దిగారు. టీడీపీ నేతల చర్యలను పోలీసులకు ఫిర్యాదు చేసి అడ్డుకోబోయిన వైఎస్సార్‌సీపీ నాయకులతో వాగ్వాదానికి దిగారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని విద్యానగర్, మండల పరిధిలోని గొడుగునూరు తదితర బూత్‌లలో వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి.

ఏజెంట్ల మధ్య వాగ్వాదం

వైఎస్సార్ జిల్లా చిన్నగురువళూరు పోలింగ్ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ ఏజెంట్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో కుచ్చుపాప ఉగ్ర నరసింహులు, వినోద్ కుమార్‌లు గాయపడ్డారు. వీరిలో వినోద్ కుమార్‌ను మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పడమర అనంతపురం గ్రామంలో ప్రశాంతం జరుగుతున్న పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి సతీమణి పోలింగ్ అధికారులు, ఏజెంట్ల పట్ల దురుసుగా ప్రవర్తించగా పోలీసులు అక్కడి నుంచి పంపేశారు.

టీడీపీ రౌడీల దాడి


నక్కవాండ్లపల్లిలో టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన తిరుపాల్‌నాయుడు

రాయచోటి : టీడీపీ రౌడీ మూకల చేతిలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు తిరుపాల్ నాయుడు తీవ్రంగా గాయపడ్డారు. రాయచోటి రూరల్ మండలం నక్కావాండ్లపల్లి పోలింగ్ కేంద్రంలో దొంగ ఓట్లకు అనుమతి లేదని గ్రామ సర్పంచ్ ప్రభావతమ్మ, ఆమె సోదరుడు తిరుపాల్‌నాయుడు గ్రామస్థు సూచించారు. ఈ సందర్భంగా మాటా మాటా పెరిగి ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం తలెత్తింది. పోలీసులు సర్ది చెప్పి పంపినప్పటికీ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి ఆ గ్రామానికి రావడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు రౌడీమూకలు కలిసి తిరుపాల్‌నాయుడును రక్తగాయాలయ్యేలా కొట్టారు. పోలీసులు చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. గాయపడిన తిరుపాల్‌నాయుడును ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సంఘటనపై ఎమ్మెల్యే ఆరా తీశారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు రాయచోటి అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

తంబళ్లపల్లెలో టీడీపీకి ఝలక్

- పోలింగ్ కేంద్రాల వైపు కన్నెత్తి చూడని నాయకులు
- ఏజెంట్లు లేక టీడీపీని వెంటాడిన ఓటమి భయం
- ఓడిపోతే ఇన్‌ఛార్జి పదవి ఇవ్వనన్న చంద్రబాబు

బి.కొత్తకోట : తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఓటరు తీరు.. టీడీపీకి ఝలక్ ఇచ్చింది. సోమవారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్సీపీతో పోటీ పడలేక ప్రతి పక్ష పార్టీ చేతులెత్తేసింది. ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జయచంద్రారెడ్డి వైఎస్సార్సీపీతో పోటీ పడలేక అస్త్ర సన్యాసం చేసినట్లయింది. దీనికి తోడు టీడీపీ నాయకులు ఎన్నికలకు పూర్తిగా దూరమవడం, తమకు ఎన్నికల పట్టనట్లు వ్యవహరించడం కనిపించింది. పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ నాయకులు కనిపించకపోవడం, ఏజెంట్ల పరిస్థితి అలాగే ఉండడం ఇందుకు అద్దం పడుతోంది. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో టీడీపీ నియమించిన ఏజెంట్లు పోలింగ్ మొదలైన తర్వాత బయటకు వచ్చేశారు.గత అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరపరాజయం చవిచూసిన ఆ పార్టీ ఈ ఎన్నికల్లో కోలుకునేందుకు పడరాని పాట్లు పడింది. చంద్రబాబు ముందుగానే టిడిపి అభ్యర్థిగా జయచంద్రారెడ్డి పేరు ప్రకటించినప్పటికీ.. ఆ పార్టీ క్యాడర్ తొలుత వ్యతిరేకత చూపింది. అనంతరంవారిని కలపడం, కులం ఓట్లు అంటూ లెక్కలేసుకుని టీడీపీ సీటు జయచంద్రారెడ్డికి ఇచ్చినట్లు చంద్రబాబు చెప్పినా చివరికి ఆ లెక్కలే వారి పార్టీ కొంప ముంచాయి. ఒక సామాజిక వర్గానికి ప్రాధాన్యం ఇవ్వడం, ఇతర వర్గాలను దూరం పెట్టటడం టీడీపీలో అగ్గి రాజేసింది. ఈ ప్రభావం ఎన్నికల్లో స్పష్టంగా కనిపించింది. దీనికి తోడు బలంగా ఉన్న వైఎస్సార్‌సీపీని ఢీకొనేలా స్థానిక నాయకులు పార్టీ కోసం పనిచేసేందుకు ముందుకు వచ్చినప్పటికీ వారి సహకారం తిరస్కరించారు. ఈ ప్రభావం ఎన్నికల్లో స్పష్టంగా కనిపించింది. సోమవారం పోలింగ్ సందర్భంగా టీడీపీ నాయకులు ఎక్కడా కనిపించలేదు. వారి కదలికలు గాని, హడావుడి కానీ లేకుండాపోయింది. ఓడిపోతున్నాం.. ఇక కష్టపడడం ఎందుకనే అభిప్రాయం వ్యక్తమైంది. మొత్తం ఎన్నికల వ్యవహారాన్ని వదులుకొని చేతులెత్తేసిన చరిత్ర తంబళ్లపల్లెలో టీడీపీకే దక్కింది.

ఓడితే నో ఇన్‌ఛార్జ్

టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోతే తర్వాత ఇన్‌ఛార్జిగా కొనసాగవచ్చునున్న ఆలోచనతో ఉంటే అది నెరవేరదని చంద్రబాబు స్పష్టం చేసినట్లు తెలిసింది. తంబళ్లపల్లె నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ ఆడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. అందులో జయచంద్రారెడ్డిపై టీడీపీ మండల కన్వీనర్లు చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను దృష్టిలో పెట్టుకొని జయచంద్రారెడ్డికి టికెట్ ఇచ్చినట్టు చంద్రబాబు చెప్పుకున్నారు. దీంతో జయచంద్రారెడ్డి వర్గం అసంతప్తి వ్యక్తం చేస్తోంది.

ప్రశాంతతకు భంగం కలిగిస్తే ప్రజలే తిప్పికొడతారు

ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి : ప్రశాంతంగా జరుగుతున్న పోలింగ్‌ను భగ్నం చేయాలని చూస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. పోలింగ్ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి, అతని అనుచరులు పోలింగ్ కేంద్రాల వద్ద ప్రేరేపిత కార్యక్రమాలు చేపట్టడంపై శ్రీకాంత్ రెడ్డి స్పందించారు. లక్కిరెడ్డిపల్లి మండలం చౌటపల్లి, రాయచోటి రూరల్ మండలం నక్కవాండ్లపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ నాయకులు దాడులకు దిగిన సందర్భాలను ఆయన గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రశాంతతను కోరుకుంటున్నారని పేర్కొన్నారు. టీడీపీ నాయకులు ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు చేసినప్పటికీ.. నిర్భయంగా నియోజకవర్గ ప్రజలు ఓటుహక్కును వినియోగించుకోవడంపై శ్రీకాంత్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.


రాయచోటిలోని మార్కెట్ సమీపంలో పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రెండోసారి సీఎంగా వైఎస్ జగన్

రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి

రాజంపేట : రెండోసారి సీఎంగా వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికవడం తథ్యమని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి పేర్కొన్నారు. నందలూరు మండలం వైసీపల్లెలో ఓటేసిన అనంతరం సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ఐదేళ్ల పాలనలో ప్రతి ఇంటికీమేలు చేసేలా సంక్షేమ కార్యక్రమాలను సీఎం జగన్ తీసుకొచ్చారన్నారు. ఈ సారి ఓటింగ్‌లో మహిళలు అత్యధికం శాతంలో పాల్గొన్నారంటే సంక్షేమమే కారణమని వివరించారు. అన్ని పార్టీలు ఏకమైనా ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డి వెంట ఉన్నారనడానికి ఈ పోలింగ్ నిదర్శనంగా నిలుస్తుందన్నారు. రాజంపేట ఎంపీ అభ్యర్థిగా పీవీ.మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. ఈయన వెంట నందలూరు ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డితో పాటు వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై చెన్నకేశవుడు

వల్లూరు : పుష్పగిరి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. సోమవారం కామాక్షీ వైద్యనాథ స్వామి తిరుచ్చి వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామికి అభిషేకం, శ్రీ చక్ర సహిత కామాక్షీ అమ్మవారికి కుంకుమార్చన చేశారు. అనంతరం స్వామి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చెన్న కేశవ స్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షితులు ఆధ్వర్యంలో యాగశాల పూజలు, వివిధ హోమాలను నిర్వహించారు. స్వామి, అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాత్రి లక్ష్మీ చెన్నకేశవస్వామి అశ్వ వాహనంపై కొలువు దీరి భక్తులకు దర్శనమిచ్చారు. మంగళ వాయిద్యాలు, దివిటీల వెలుగులతో కొండపై నుంచి స్వామిని పెన్నా నది మీదుగా పల్లకిలో మోస్తూ గ్రామంలోని వీధులలో ఊరేగించారు.


అశ్వ వాహనంపై చెన్న కేశవ స్వామి

నేడు చక్రస్నానం

పుష్పగిరి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం ఉదయం వైద్యనాథస్వామి త్రిశూలం, చెన్నకేశవస్వామి సుదర్శన చక్ర స్నానం జరుగుతుంది. అనంతరం రెండు ఆలయాల్లో పూర్ణాహుతి, ధ్వజావరోహణం చేస్తారు. సాయంత్రం 4.30 గంటల నుండి లక్ష్మీ చెన్నకేశవాలయంలో పుష్పయాగం జరుగుతుంది. రాత్రి 7 గంటలకు శ్రీ కామాక్షీ వైద్యనాథ స్వామి ఆలయంలో రావణేశ్వర వాహన సేవ జరుగుతుంది. అనంతరం చెన్న కేశవ స్వామికి తిరుచ్చి వాహన సేవ జరుగుతుంది.

ఆటో ఢీకొని యువకుడు దుర్మరణం

బి.కొత్తకోట : ఇంటికి వచ్చిన బంధువును బస్టాండులో వదిలేందుకు బైక్‌పై వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో ఓ యువకుడు దుర్మరణం చెందిన ఘటన సోమవారం బి.కొత్తకోట సమీపంలో జరిగింది. ఏఎస్ఐ బొజ్జే నాయక్ కథనం మేరకు.. బి.కొత్తకోట-పీటీఎం రోడ్డు టి.సదుం క్రాస్‌లో వెంకటరమణారెడ్డి నివాసం ఉంటున్నాడు. ములకలచెరువు మండలం మద్దినాయునిపల్లి గ్రామానికి చెందిన బంధువు మమత (40) వీరి ఇంటికి వచ్చారు. సోమవారం తిరిగి ఆమె స్వగ్రామానికి వెళ్లేందుకు సిద్ధమైంది. వెంకటరమణారెడ్డి ఈమెను బైక్ పై తీసుకెళ్లి బి.కొత్తకోట బస్టాండ్‌లో దింపాలని కొడుకు హర్షవర్ధన్ రెడ్డి (20)కి చెప్పాడు. హర్షవర్ధన్ మమతతో బైక్ పై బి.కొత్తకోట వస్తుండగా, ఆలేటివారిపల్లె క్రాస్ వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో హర్షవర్ధన్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. గాయపడిన మమతను మెరుగైన వైద్యం కోసం బెంగళూరు తరలించారు. హర్షవర్ధన్ మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి ఆస్పత్రి తరలించారు. మతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.


మతి చెందిన హర్షవర్ధన్ రెడ్డి